
# నో థ్యాంక్స్

తురగా జానకీ రాణి



ఆ రోజు లంచ్ సమయంలో ఆ మహా భవంతిలో ఒక విచిత్రమైన ప్రశ్న వచ్చింది. ఏడంతస్తులలో ఉన్న ఆఫీసులలో పని చేస్తున్న అమ్మాయిలు పది పన్నెండు మంది కలసి, నాలుగో అంతస్తు లోని ఒక క్యాంటీనులో కూచుని, భోజనం చేసేటప్పుడు 'అందరిలోకీ ఎవరి బాస్ అందగాడు?' అనే ప్రశ్న వచ్చింది. కొన్ని పేర్లు అమ్మాయిల నోటి మీదుగా దొర్లాయి. యువకులు, బట్ట తల పెద్ద మనుషులు, నడి వయస్సు హోదా గల అధికారులు, అందరిని గురించి సరదాగా మాట్లాడుకున్నారు.

ఆ మహా భవంతి పేరు 'దీప్తి' టవర్సు. ముప్పై, నలభై ఆఫీసులు, కొన్ని క్వార్టర్లు, క్రింద గ్యారేజీలు, చూడడానికి అంతా అందంగా, ఆధునికంగా ఉంటుంది. ప్రతి అంతస్తులో మొక్కల కుండీలు,

ఎర్రని నార తివాచిలు, మంచి సంగితంతో, సుగంధాలతో పై అంతస్తుల్లోకి చిరునవ్వుతో మనుషులను చేరవేసే రెండు లిఫ్టులు - అల్లాంటి చోట ఏ పని చేసినా గొప్పే!

సుదీర్ఘ చర్చల అనంతరం, 'కిశోర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ' ఆర్థిక శాఖ మేనేజరు ఆదిత్య కిరణ్ అందరిలోకీ అంద గాడని ఓటు వేశారు యువతీ యువకులు. వెంటనే ఆయన గారి కార్యదర్శి ఇందుబాలని అభినందించారు అందరూ. నలభై సంవత్సరాలు దగ్గర పడుతున్నా ముప్పై ఏళ్ల గంధర్వ పురుషునిలా ఆకర్షణ ఉట్టిపడే స్వరూపం, చదువు, సంస్కారం, పెద్ద జీతం, మర్యాద గల పెద్ద మనిషి అని ఏకగ్రీవంగా అంగీకరించారు.

ఇంకేం! 'మిస్టర్ దీప్తి టవర్స్' దగ్గర పని చేస్తున్న ఇందుబాల ఎంతో అదృష్టవంతురాలని పొగిడి ఆమె దగ్గర వెంటనే చాక్లెట్లు, ఫన్టు తర్వాత ఐస్ క్రీం వాగ్దానం పుచ్చుకున్నారు. ఆ పన్నెండు మందిలోనూ కొంచెం మానవత్వం ఉన్న మనిషి జ్యోతి. "పోండే! ఆయన గారికి పేళ్లయిపోయింది. ఒకరో ఇద్దరో పిల్లలు కూడా. ఆయన అందంగా ఉంటే మన అమ్మాయికి ఏం లాభం?" అని ఒక పాయింటు ప్రస్తావించింది.

ఇందు బాలకి వెంటనే ఈ మాట నచ్చింది. "ఔనర్రా! ఆయన అందగాడని అందలానికి ఎత్తితే నాకు ఇంక్రిమెంటు కాదు కదా, ఒక కప్పు టీ అయినా అదనంగా ఇస్తారా? అందుకే మీ అందరికీ ఈ చాక్లెటుతో పార్టీ సరి" అని చెప్పేసింది.

అందరూ నవ్వుకొన్నారు. లేచి ఎవరి ఆఫీసుకి వాళ్లు వెళ్లారు.

ఆ రోజు ఆదిత్య కిరణ్ దగ్గర డిక్టేషన్ తీసుకుంటున్న ఇందుబాల తలెత్తి ఈయన నిజంగా 'మిస్టర్ దీప్తి టవర్స్' బిరుదుకి తగిన వాడేనా అన్నట్లుగా నిశితంగా చూసింది. షేవింగు వలన వచ్చిన ఆకుపచ్చదనం మినహా చెవుల దగ్గర నుంచి నుదిటి పై వరకు పెదవి కింద నుంచి చుబుకం వరకు ఎంత మెరుపు, ఆరోగ్యమైన పసిమి రంగు, పొడుగాటి కనురెప్పలు, కళ్లజోడులో దాక్కో లేక వాలిపోతున్నట్లున్న చూపులు - "అయ్యో బాబోయ్!" అనుకుంది సినిమా ఫక్కీలో ఇందుబాల.

పావు గంట, అరగంట, గంట కూడా ఆయన గదిలో కూచుని ఉత్తరాలు డిక్టేషను తీసుకోవడం రోజువారీ కార్యక్రమం ఆమెకి. ఎవ్వరికీ తెలియకూడని విషయమైతే, ఆ పక్కనే ఉన్న కాబిన్‌లో కూచుని టైపు చేసి ఇవ్వడం - 'ఎస్ సార్!' అంటూ ఆయన ఆదేశించినట్లు, టెలిఫోన్ టెలెక్సు సందేశాలు అందించడం, నంబర్లు గుర్తుంచుకొని, క్షణాలలో ఆయన కోరిన కనెక్షన్లు తెప్పించడం, విమానాల టిక్కెట్లు కొనిపించడం, ఇవన్నీ చేసేటప్పుడు ఇందుబాల ఇంకా పరిశీలించింది కేవలం, 'ఆయనకి బిరుదు ఇవ్వడం సముచితమేనా' అని తేల్చుకోవడానికే. ముభావంగా ఆమె ఎవరి వంకా తేరిపార చూడదు. అవసరం మించి ఒక్క మాట కూడా మాట్లాడదు. కృత్రిమంగా నవ్వదు. ఏ సందర్భంలోనూ వెకిలితనం, చపుకతనం ఆమెలో కానరావు. ఇరవై ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉన్నా పెళ్లి కాలేదంటే కారణం తగిన మనిషి దొరకకపోవటమే.

కూతురు పెళ్లి ఆలస్యం అయిపోయిందని అమ్మ, నాన్న గొడవ పడుతున్నారు. ముప్పై రెండేళ్ల అన్నయ్య తనూ పెళ్లి చేసుకోకుండా చెల్లెలికి సంబంధం కుదిరే వరకు ఆగుతున్నాడు. అతనికి చాలా సంబంధాలు వస్తున్నాయి. కానీ చెల్లెలి పెళ్లి అయితేనే గానీ చేసుకోనని గట్టిగా చెప్పవలసి వస్తోంది.

బి.కామ్., టైపు., షార్టుహాండు వగైరా కోర్సులు పాసు కావడం వల్ల పే రున్న కంపెనీలో మంచి జీతంతో ఉద్యోగం దొరికింది. దీనితో ఇందు తన జీవితం మంచి మలుపు తిరిగిందని తృప్తి పడింది. అమ్మ, నాన్న మాత్రం అంతగా సంతోష పడలేదు. ఈనాటికీ కూతురు ఒక కొత్త చీర కట్టుకున్నా తలలో పొందికగా పూలు పెట్టుకున్నా ఒక నిట్టూర్పుతో చూస్తుంది అమ్మ.

ప్రతి వారం పేపర్లన్నిటిలో వివాహ ప్రకటనలు చూస్తూ, నాన్న పనికి వచ్చేవి పెన్సిలుతో గుర్తు పెట్టి, ఆ పూటే కవర్లు వ్రాసి పడేస్తూంటారు. ఆయన అతి పరిశీలనగా పేపరు చదివి, అమ్మతో కంఠం తగ్గించి మాట్లాడే పద్ధతి, ఇందుకి చాలా


GANGA ®

FOR GUARANTEED PERFORMANCE

IS:9079

IS:8034




GANGA
MONOBLOCKS & SUBMERSIBLE PUMPS

MANUFACTURERS :
GANGA FOUNDRY 9/103, PILLAIYAR KOIL STREET,
B.R. PURAM, PEELAMEDU, COIMBATORE - 641 004. PHONE : 574412.

పరిచితం. 'మళ్లీ పెళ్లి చూపులా! అయినప్పుడే అవుతుందిలే' లాంటి మాటలు అంటూ ఉంటుంది. ఆ పెడసరం మాటలు అమ్మకి ఇష్టం ఉండవు. ఈసడింపుగా చూస్తుంది.

రోజులు సాఫీగా గడవటంలేదు. రోజు రోజుకూ ఇందు పెళ్లి సంబంధాల అన్వేషణ, మధ్యలోనే వైఫల్యాలు, నిట్టూర్పులు, నిరాశలు, 'ఉద్యోగం మానేసి ఇంటి పట్టున ఉండు, కాస్త నవనవలాడతావు' అని అమ్మ సాధింపులూ, ఏవీ పట్టించుకోకుండా ఇందు ఆఫీసుకి వెడుతూనే ఉంది. సోమవారం ఉదయమూ అలాగే వెళ్లింది.

పార్కింగు స్థలంలో ఆదిత్య గారి గంధం రంగు 'మారుతి' కారు కనపడలేదు ఆమెకి. ఎందుకనో అనుకుంటూ లిఫ్టులోకి ప్రవేశించింది. లిఫ్టు అబ్బాయి, "మేడమ్! మీ ఎండి గారి భార్యకి చాలా సీరియస్ జబ్బు. తెలియదా మీకు!" అన్నాడు.

ఇందుకి ఒక్కసారి షాక్, గబగబ గుండె కొట్టుకోవడం, చేతులు వణకడం, ముఖం పాలిపోవడం - అన్నీ ఆమె ఆరో అంతస్థుకి చేరేలోపే జరిగాయి. ఏం జరిగింది, ఆమె ఎక్కడున్నారు, ఎవరు చెప్పారు లాంటి ప్రశ్నలు అడగలేకపోతుంది ఆమె. ఆఫీసులోకి అడుగుపెట్టే సరికే అయిదారుగురు ఉద్యోగులు నిలబడి మాట్లాడుకుంటున్నారు.

"ఇందూ! ఎమ్.డి గారి భార్యకి ఉన్నట్టుండి జబ్బు చేసిందే. బ్రెయిన్ ట్యూమరు అనుకుంటున్నారు. ఆస్పత్రిలో చేర్చారుట. నువ్వెళ్లి చూడలేదా?" అన్నారు ఒకరు.

ఇందు కూలబడింది. "లేదు" అన్నది మెల్లిగా.

"అదేమిటండీ; మీరు కూలబడిపోతున్నారు?" అని ఒకామె వచ్చి పక్కన నిలబడింది. మంచినీళ్లు ఇచ్చారు. అవి కూడా తాగలేకపోతోంది. కళ్లల్లో నీళ్లు తిరిగి మరుక్షణమే పెద్ద బొట్లుగా బుగ్గల మీద నుంచి కారసాగాయి.

"మిస్ బాల ఎంతో అప్‌సెట్ అయినారు. ఆయన ఈమెకి బంధువా?" అన్నది మరో కామె.

తమాయించుకుని తెప్పరిల్లి, తల అడ్డంగా ఊపి, "ఎవరినైనా చూడనిస్తున్నారా?" అన్నది.

"లే దండీ! అదేగా గొడవ! ప్యూన్ శేఖర్ నిన్ననే వెళ్లాడు. శనివారం రాత్రి జబ్బు చేసిందిట. పెద్ద వాంతులు, తలనొప్పి, స్పృహ తప్పిపోవడం, అన్నీ ఒక గంటలోపే జరిగాయిట" - అని వర్ణిస్తూ చెప్పాడు ఒకతను.

"ఇందూ! మీ ఫ్రెండు జ్యోతి దగ్గరకి నిన్ను పంపించి వస్తాను" అన్నది టైపిస్టు.

"వద్దులే. శనివారం మధ్యాహ్నం కొన్ని అర్జెంటు కాగితాలు ఇచ్చారు ఆయన. అవి పూర్తి చేస్తాను" అని ఆదిత్య గది వేపు వెళ్లింది. తలుపు తెరవడానికి చేతులు వణుకుతున్నాయి. బుర్ర పనిచేయడంలేదు. 'అంత మంచి మనిషికి, అంత కష్టం వచ్చిందా? ఆమె ఎలా ఉన్నదో!! ఆయన ఏమై పోతున్నాడో! పిల్లలు ఎంత ఏడుస్తున్నారో! ఆవిడ... ఆవిడ అసలు బ్రతుకుతుందా?'

గుండె లోపల ఏదో గుభిల్లుమన్న ఫీలైంది ఇందుకి. పనిచేయలేకపోతోంది. తలుపు తెరుచుకుని జ్యోతి వచ్చింది. "ఏమిటే, నువ్వు కన్నీరు మున్నీరై పోతున్నావుట?" అన్నది.

ఆఫీసులో వాళ్లు జ్యోతికి ఫోను చేసి రమ్మన్నారన్నమాట.

మిత్రు లిద్దరూ కొంత సేపు సంప్రదించుకొని, ఆస్పత్రికి ఫోను చేశారు. పేషెంటు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంది. ఎవ్వర్నీ రా నివ్వరు. 'ఆదిత్య గారితో మాట్లాడతారా?' 'వద్దు - వద్దు' అని పెట్టేసింది ఇందు ఫోను.

"వెళ్లి చూడాలని ఉన్నదే!" అన్నది బిక్కగా.

"చూడ నివ్వరు కదా! వరండాలు చూసి వచ్చేదేమిటి?" అన్నది జ్యోతి.

"ఆమెను కాదు" అన్నది తలవంచి.

"ఓహో! ఆదిత్య గారినా? పలుకరించాలని ఉందా? పద పోదాం" అని జ్యోతి లేచింది.

ఇందు సెలవు చీటీ వ్రాసి పెట్టింది ఆయన బల్ల మీద, అది తన స్వంత పనేగా అనుకుని.

- ఆ రోజు మాత్రమే గడిచింది. ఆ మరునాటికి ఆమె లేదు. కళ్లు తెరచి చూడకుండా, తుది మాటలైనా చెప్పకుండా, ఆదిత్యనీ, ఇద్దరు అబ్బాయిల్నీ వదిలేసి వెళ్లిపోయింది. ఇందు, జ్యోతి ఆ సమయంలో వారి కుటుంబంలోని సభ్యుల్లాగ మసిలారు. ఎంతో సాయం చేశారు.

"వాళ్లతో మన కేమి టమ్మా సంబంధం" అని అమ్మ అంటున్నా వినక రోజూ ఉదయమే వెళ్లిపోయేది ఇందు. ఆమెకు తోడుగా జ్యోతి. ఇంటి పనుల్లో జొరబడి, పిల్లల అవసరాలు చూస్తూ, చుట్టాల్లో కలసిపోయి, ఫోనులు, టెలిగ్రాములు, డ్రైవర్లకి పురమాయింపులు, ఆఫీసు అర్జెంటు వ్యవహారాలు, పరిష్కారాలు - ఇలాగ వా రింట్లో కనీసం పది రోజులు మెంబరై పోయింది. కాస్సేపు ఆఫీసుకి వెళ్లి వచ్చేది. ఆయన గారి కార్యదర్శి ఎందు కింత కలివిడిగా ఉందని ఎవ్వరూ అడగలేదు. ఆ సమయంలో ఆ మాత్రం నిలబడి సమర్థవంతంగా నాలుగు సంగతులు తెలిసికొని, నిర్వహించేవారు తక్కువ మంది ఉన్నారు ఆ కుటుంబంలో. అందుకే ఇందు మీద ఆధారపడింది చాలా వ్యవహారం.

కార్యక్రమాలన్నీ ముగిశాయి. పన్నెండో రోజు రాత్రి కాబోతుంటే ఒంటరిగా కూర్చున్న ఆదిత్య దగ్గరికి వెళ్లింది ఇందు. ఆయన కళ్లు మూసుకుని ఉన్నాడు. "నే నింక వెడతాను సార్!" అన్నది.

ఆయన కళ్లు తెరవకుండానే తలూపాడు. బయటకు వచ్చి బస్సు కోసం కాస్సేపు చూసి ఆటోలో ఎక్కింది. 'వెడుతున్నావా' అని గానీ, 'కారులో వెళ్లు' అని గానీ, 'ఎవ రన్నా ఆటో ఎక్కిస్తారు ఉండు' అని గానీ అనలే దాయన. అలా అంటూ కృతజ్ఞతలు చెప్పాలని ఆమెలో చిన్న ఆలోచన రాగానే, 'పోనీలే పాపం అనుకుంటూ జాలి పడింది.

ఆ తర్వాత నుంచి ప్రతి రోజూ ఆదిత్య ఆఫీసుకి వస్తూనే ఉన్నాడు. ఇందుబాల చురుగ్గా పనిచేస్తూనే ఉంది. భాము లందరూ ఒకనాడు లంచ్ టైములో కూడినప్పుడు ఒకామె నోరు జారినట్లు "ఏమోయ్! మిసెస్ దీప్తి టవర్సు" అని పలుకరించింది.

ఇందుబాల ముఖం ఎర్రబడిపోయింది. అది కోపం కాదు, నిర్ఘాంత పోవటం కాదు. తీవ్రంగా మనస్సుకి గాయం తగలడం కాదు. కాఫీ తాగుతున్న వారు నిశ్శబ్దమై పోయారు.

జ్యోతి ముందుగా తేరుకుని "ఏమిటి, ఆ సిల్లీ మాటలు! జోక్‌గా అనే మాటేనా అది?" అన్నది. ఆ మాట అన్న అమ్మాయి కూడా రెట్టించకుండా "సారీ! ఆదిత్య గారి భార్య పోవడం చాలా విచారకరం. కానీ నాకు ఎందుకో అట్లాంటి ఐడియా వచ్చేసింది. సారీ ఇందూ!" అంటూ ఆమె చేతులు పట్టుకుంది.

లంచ్ ముగించుకొని అందరూ వెడుతోంటే, జ్యోతి ఇందుబాల దగ్గరగా వచ్చి, "సాయంత్రం మా ఆఫీసుకి రా" అన్నది.

సాయంత్రమైంది. ఒకమ్మాయి నోరు జారి అన్న మాటను సీరియస్‌గా విశ్లేషించి "ఏమే, ఆయనంటే అంత గొప్ప ఇష్టం నీకు. పిల్లల్ని హాస్టలుకి పంపేశారు. మహా అయితే నీ కంటె పది, పన్నెండేళ్లూ పెద్ద" అని ఆరంభించింది ఆ విషయాన్ని.

'ఏమిటే ఆ మాటలూ?' అని ఇందు గావు కేక పెట్టలేదు. 'ఛీ, రెండో పెళ్లా, నలభయ్యోపడి చేరినవాడిని, ఇద్దరు పిల్లల తండ్రినా, నాకు పెళ్లి కాక

## హైకూలు

సెలయేటిని చిరు గలగల
కీచురాళ్ల రొద సేవధ్యం -
రాత్రి గుండె ఏదో కల

జారెడు అదె జలజలజల
చూరు నుండి నీరవతల -
తలపుల గాజుల గల గల!

మనిషి నడచు దారి
కలకల, ఒక గడ్డి పువ్వు -
అతని కనులు నెత్తి పైన!

మింటి పైన తెలి మబ్బులు
చిత్ర పటము లినుకలోన
రెల్లు పూల పెను దుబ్బులు!

తూకవు రాళ్లకు అడుగున
కొంత ఇనుము తరిగె
నగలవి ఒక స్త్రీ గళమున!

చిన్నప్పుడు కథలు చెప్పు
మామ్మ బామ్మ గోడ మీద -
నీటి పొరలు కనుల కప్పు!

జీర వెలుగులో మూలుగు
వడివడిగా ఎగ ఊపిరి -
తుది తారలు విరుగు జిలుగు!

గంగా నదిలో స్నానం
చేయి తగుల గగురుపాటు -
కళేబరపు తుదియానం.

ఎప్పుడో సీతారాముల
శ్వాస గాలి, ఇప్పుడు కూడ
ప్రతి శ్వాసను పరిమళములు!

భట్టిప్రోలు కృష్ణమూర్తి

ఏడుస్తున్నా ననుకుంటున్నావా?' - లాంటి పోటుకు మాటలేవీ అనలేదు. ఆలోచిస్తున్నట్లు ఊరుకుంది. ఆదిత్య కిరణ్ వంటి సత్పురుషునికి రెండో భార్యగానైనా దగ్గర కావడం - బాగానే ఉంటుంది. రో జంతా ఆ సుందర మూర్తిని చూస్తూ, జీవితం పంచుకుని, తోడు నీడగా ఐక్యమై పోవడం. చాలా బాగుంటుంది. కానీ ఎవరు ఆయనతో చెప్పే వారు? అమ్మ, నాన్నకి చెబితే అంత గతిలేని వాళ్లమా అని అవురుమని ఏడ్చేస్తారు.

జ్యోతి ఆ పెద్దరికం తన మీద వేసుకుంది. ఆమెకి పె ళ్లయింది. వా ళ్లాయన కూడా దీప్తి టవర్సులోనే మరో కంపెనీలో పని చేస్తాడు. ఎమ్.డి. గారి భార్యలాగ ఇందు జీవితం ఎలా ఉండవచ్చునో జ్యోతి వర్ణించ సాగింది. ఇదివరకే ఇందు మనస్సులో ప్రవేశించిన ఆదిత్య స్థిరమైన దైవంగా ప్రతిష్ఠితమై పోతున్నాడు.

ఆ రాత్రే జ్యోతి, వా ళ్లాయన ఆయ నింటికి వెళ్లి మాట్లాడారు. ఆదిత్య గారి పె ద్దబ్బాయి పన్నెండవ తరగతి, రెండో వాడు పదవ తరగతి. ఇద్దరూ హాస్టలులో ఉన్నారు. వేసవిలో భార్య పోయాక, సెలవలు కాగానే ఇద్దర్నీ పంపేశా డాయన. ఇంట్లో ఆడ దిక్కు లేదు. ఆలోచించి నాలుగు రోజులకు చెప్తా నన్నాడు ఆదిత్య.

ఆ నాలుగు రోజులూ ఇందు పరిస్థితి వర్ణనాతీతం. ఆదిత్యని చూస్తే మనస్సు పులకరించిపోతోంది. 'నీకు ఇష్టమేనా?' అని అడగలేదు ఆయన. చిరు నవ్వు కూడా చేతకానట్లు ఆఫీసు పని చెప్పటం, ఆమె చేసుకుని పోవడం "ఏమిటి ఈయన రాయా, మొండి మనిషా, జితేంద్రియుడా" అని అనుమానం వస్తోంది ఇందుకి.

రాత్రి, పగలు ఆమెకి కలలే! గంధపు రంగు మారుతీ కారు, చక్కని తోటతో బంగళా, ఒంటరిగా తనూ, ఆదిత్యా - అమర్చి ఉంచిన ఆ ఇంట్లో ప్రవేశించడం, ఆయన హృదయేశ్వరిగా నిలిచిపోవడం - ఇవే కలలు. సినిమాల్లో తను చూసిన సముద్ర తీరం, ఊటీ, కాశ్మీరు దృశ్యాల్లో ఆ నవమన్మథుని చెంతనే తను! ఉద్యోగం మా నెయ్యాలా? ఎందుకు? రోజూ ఆయనతో కలసి ఆఫీసుకి రావచ్చును. సెలవులకి పిల్లలు వస్తే కాస్త వండిపెట్టి, స్నేహితుల్లాగ ఆదరించాలి. వాళ్లకి అన్నం తినిపించాలా, బట్టలు తొడగాలా, ఏమీ అవసరం లేదు.


సాయంకాలమైంది. ఆఫీసు ఖాళీ అయిపోతోంది. ఆరో అంతస్తులోని ఆదిత్య కిరణ్ గదిలోంచి ఎంతో అందంగా నగర దృశ్యం కనిపిస్తుంది. అక్కడ నిలబడి నగరం వంక చూస్తూ ఆయన ఎప్పుడూ సమయం వృధా చేసుకోడు. కానీ ఈ రోజు నిలబడ్డాడు. ఎంత సౌష్ఠవమైన విగ్రహం!

ఇందు కాగితాలు సర్దేసి, "సార్! నేను వెళ్లనా?" అన్నది.

ఆయన వెనక్కి తిరిగి, కొంచెం ముందుకి వచ్చి, ఆమె వంక చూశాడు. ఒళ్లు ఝల్లు మనడమూ, తీపి బాధతో జివ్వు మనడమూ ఏమిటో గానీ ఇందు కళ్లు వాల్చింది. "మిస్ ఇందుబాలా! ఈ కవరు అంటించి పోస్టులో వేస్తారా?" అని కవరు ఆమె చేతి కిచ్చాడు. అది ఆయన కొడుకు పేర వ్రాసిన ఉత్తరం. "తెరచే ఉంది. మీరు చదవాలనే అలా ఇస్తున్నాను" అన్నాడు. 'సరే, సరే' అని పెదవులు కదలకుండానే చెప్పి, బాగులో పెట్టుకుంది. "మన పెళ్లి సంగతి వ్రాశారా సార్?" అని వెర్రిముఖంతో అడుగలేదు. ఆయన ఆజ్ఞాపించడం, తను వినడం, ఎప్పుడూ అదేగా జరిగేది!

ఇంటికి వెళ్లకుండా, దగ్గర్లో ఉన్న పార్కుకి వెళ్లింది ఇందు. ఒక గుబురు చాటున కూచుని ఉత్తరం విప్పింది.

"మైడియర్ పెద బాబూ!" అని ఆరంభించి కుశల ప్రశ్న లైనాక, "నీ కొక ముఖ్యమైన సంగతి వ్రాస్తున్నాను. చిన్న వాడివైనా వివేకం కలవాడివి కనుక, జాగ్రత్తగా చదివి అర్థం చేసుకో. అమ్మ




పోయి నాలుగు నెల లైంది. మీ రిద్దరూ తల్లిలేని పిల్ల లైనారు. ఈ మాటే చాలు ప్రతి ఒక్కరికీ కడుపు కోసే గుబులు కలగడానికి. ఇంట్లో మీ భోజనం, సౌకర్యాలు చూచే బామ్మ, అమ్మమ్మ అత్తయ్యలు ఎవరూ లేరు కనుక మిమ్మల్ని హాస్టలుకి పంపాను. అలా పంపడానికి నేను ఎంత బాధపడ్డానో మీకు తెలును.

"నా దగ్గర పని చేస్తున్న మిస్ ఇందుబాలని నేను మళ్లీ పెళ్లి చేసుకుంటే బాగుంటుందని మిత్రులు వచ్చి నన్ను అడిగారు. ఆలోచించి చెబుతా నన్నాను. కానీ నా ఆలోచన కంటే మీ ఆలోచన ముఖ్యం. వయస్సు చిన్నదైనా పెద్ద అనుభవం, దుఃఖం ఎరిగిన వాడివి కనుక నీ కీ సంగతి వ్రాస్తున్నాను. తమ్ముడికి అంతా బోధపరచు, నీకు అవసరమనిపిస్తే మీ ఇద్దరి నిర్ణయమే నాకు సమ్మత మవుతుందని గుర్తుంచుకో.

"మీ అమ్మతో నాకు ఇరవై ఒకటవ సంవత్సరంలో పె ళ్లయింది. నాకు ఇరవై నాలుగు నిండే సరికి మీ రిద్దరూ పుట్టారు. ఆమె నిజంగా నా సహధర్మచారిణి, నా ఊపిరి, నా ప్రాణం, సుఖం, సంతోషం, ప్రేమతో ప్రతిధ్వనించే సంసారం - అన్నీ ఆమెతోటే మాయమైనాయి. ఇంక అవి తిరిగిరావు. అనుక్షణం నా కళ్ల ముందే ఉండి ఆమె నాలో కలసిపోయిందిగానీ ఏ లోకాలకీ వెళ్లలేదు అనుకుంటున్నాను.

"కానీ మీకు 'అమ్మ' కావాలి. అమ్మ లాగ అన్నీ అందిస్తూ లాలనగా చూసే వ్యక్తి కావాలి. నేను ఏమి తిన్నా పరవాలేదు, నా ఆరోగ్యం దెబ్బతిన్నా పరవాలేదు. డబ్బు సంపాదించి మీకు ఇవ్వ గలిగే పరిస్థితి ఉంటే చాలు.

"కానీ మీరు చిన్న పిల్లలు. మీ ఆరోగ్యానికి ఇంటి భోజనం, వాతావరణం ఎంతో అవసరం. కుర్ర వయస్సులో హాస్టలులో ఉండే నేస్తాలు, అలవాట్లు, ప్రమాదాలు నాకు భయం కలిగిస్తున్నాయి. ఈ సంవత్సరం పూర్తి కాగానే మిమ్మల్ని ఇక్కడే చేర్పిస్తాను - అంటే నేను మిస్ ఇందుబాలని పెళ్లి చేసుకొని, మీకు ఒక అమ్మను ఏర్పాటు చేయగలిగితే - ఆమె దానికి సిద్ధం. మీ నిర్ణయం మిద అంతా ఆధారపడి ఉంది." ఇలా సాగిన ఉత్తరాన్ని ఇందు సాంతం చదివింది. మడిచి కవర్లో పెట్టుకుంది.

ఆ రాత్రి పెద్ద జ్వరం వచ్చింది ఇందుకి. నాలుగు రోజులకి గానీ తగ్గలేదు. అయిదో నాడు ఆఫీసుకి చేరుకుంది. లిఫ్టు ఆగగానే ఆదిత్య కిరణ్ గదిలోకి వెళ్లింది.

"సార్! ఈ ఉత్తరం పోస్టులో వేయలేదు. మీరు మీరు కూడా వేయకండి" అన్నది.

ఆయన విశాలమైన తన కళ్లను మరింత పెద్దవి చేశాడా అనిపించింది.

అవసరం లేకపోయినా, పక్కన ఉన్న కేబిన్‌లోకి వెళ్లింది ఇందుబాల. రుమాలుతో ముఖం తుడుచుకుంది. 'నాకు ఆత్మాభిమానం ఉంది సార్! నన్ను ప్రేమించి, మనసారా ఇష్టపడి, కొత్త జీవితం ఇస్తానని మీరు అనకపోతే, మీ పిల్లలకి వంట మనిషిగా, మీ 'హౌస్ కీపరు'గా వస్తా ననుకుంటున్నారా?' అని పౌరుషంగా, బిగ్గరగా అనాలనుకున్న మాటలు సుడులుగా లోపల తిరిగాయి. కానీ అవి బయటికి వచ్చే అవకాశమే లేదు.